# ఆవిరైన అలీసాగర్ నీటి ఆశలు

- పాలకుల వాయిదా నిర్ణయంతో హతాశులైన రైతులు
- 18 నుంచి నీటి విడుదలకు ప్రకటన
- అంతలోనే వాయిదా



అలీసాగర్ లిఫ్ట్ ఎత్తిపోతల పథకం

బోధన్, ఆగస్టు 18: అలీసాగర్ నీటి విడుదల విషయంలో పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. సకాలంలో ఆయకట్టుకు నీటిని విడుదలచేయడంలో నీటిపారుదలశాఖ చేస్తున్న తాత్సారం ఆయకట్టు రైతులపాలిట శాపంగా మారింది. వర్షాలు కురుస్తున్నాయన్న నెపంతో అలీసాగర్ నీటి విడుదలను అధికారులు వాయిదా వేయడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకటి, రెండ్రోజులు వర్షాలు కురిసినంత మాత్రాన నీటి విడుదల వద్దనుకోవడం విడ్డూరంగా ఉంది. వాస్తవానికి ఆయకట్టు పరిధిలో రోజుల తరబడి భారీ వర్షాలు కురవడంలేదు. ఇప్పటికే అలీసాగర్ ఎత్తిపోతల పథకం నీటి విడుదల ఎంతో ఆలస్యమైంది. నాట్లు వేసుకున్న రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల రెండో వారం ప్రారంభంలోనే అలీసాగర్ ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదలచేయాల్సి ఉంది. నీటిని విడుదల చేయాలా.. వద్దా.. సందిగ్ధంలోనే అధికారులు కాలయాపన చేశారు. అలీసాగర్ ఎత్తిపోతలతోపాటు గుత్ప ఎత్తిపోతల పథకం నుంచి కూడా సాగునీరు విడుదలచేయకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులపై 'నమస్తే తెలంగాణ' ఈనెల 9న కథనాన్ని ప్రచురించింది. మరోపక్క మాజీ మంత్రి , బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాల విషయంలో స్పందించి పాలకులను హెచ్చరించారు. దీంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డితో సంప్రదించి అలీసాగర్ జలాల విడుదలకు ముహూర్తం నిర్ణయించారు. ఈ నెల 18న ఎమ్మెల్యే చేతుల మీదుగా అలీసాగర్ నీటిని ఆయకట్టుకు విడుదలచేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో ఆయకట్టు రైతులు ఎంతో సంతోషపడ్డారు. ఆకస్మాత్తుగా ఆ నిర్ణయాన్ని అధికారులు వాయిదావేశారు. వర్షాలు పడుతున్నందున నీటి విడుదలను వాయిదా వేస్తున్నట్లు వివరణ ఇస్తున్నారు. అయితే, ఆయకట్టు పరిధిలో భారీ వర్షాలు పడలేదు. విద్యుత్ ఛార్జీలు ఆదాచేయవచ్చన్న కారణంగానే ఇటువంటి నిర్ణయాలు నీటిపారుదలశాఖ తీసుకుంటున్నట్లయితే.. అది సరైన పద్ధతి కాదని రైతులు అంటున్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఆధారంగా 53,793 ఎకరాలకు నీరందించేందుకు అలీసాగర్ ఎత్తిపోతల పథకం నిర్మించారు. నవీపేట్, రెంజల్, ఎడపల్లి, మాక్లూర్, నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి మండలాల్లోని రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. బీఆర్ఎస్ పాలనలో గతంలో పదేండ్లపాటు ఈ లిఫ్ట్ నుంచి పంటకాలంలో నీటి విడుదల చేసింది. ఇకనైనా నీటిపారుదలశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి సాగునీటిని విడుదలచేయాలని రైతులు కోరుతున్నారు.

## ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, ఆగస్టు18: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. శనివారం ప్రాజెక్ట్‌లోకి 8500 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రాజెక్ట్‌లో శనివారం 1081.5 అడుగుల(49.117టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. 5453 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. ఇందులో కాకతీయ కాలువకు 4200 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా 522 క్యూసెక్కుల నీరు ఆవిరవుతున్నది.

## రైలులో నుంచి జారి పడి యువకుడి మృతి

వినాయక్‌నగర్, ఆగస్టు 18 : కదులుతున్న రైలులో నుంచి జారిపడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్–పుణెకు వెళ్తున్న ప్యాసింజర్ రైలులో ముత్రాకర్ బాలాజీ (33) తన చెల్లెలు పూజతో కలిసి శనివారం పుణెకు బయల్దేరాడు. రైలు ఫకీరాబాద్–బాసర స్టేషన్ మధ్యలో ఉండగా బాలాజీ ప్రమాదవశాత్తు జారి పడి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. బాసర రైల్వేస్టేషన్‌కు తరలించి అంబులెన్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ అక్కడికి వచ్చే సరికి అప్పటికే మృతి చెందాడు. బాసర స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ చేపడుతున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

## ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధిపై ప్రత్యేక పుస్తకం

డిచ్‌పల్లి, ఆగస్టు 18: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–2, గ్రూప్–3 పోటీల పరీక్షలకు ప్రతిమా పబ్లికేషన్ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి పేరిట ప్రత్యేక పుస్తకాన్ని తీసుకొచ్చినట్లు నిర్వాహకులు టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ప్రతిజ్ఞ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు, కోచింగ్ సౌకర్యం లేని వారికి ఈ పుస్తకం ప్రత్యేకంగా ఉపయోగపడుతుందని, అర్థశాస్త్రానికి సంబంధించి దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు, అభివృద్ధి, అభివృద్ధిలో మార్పు, నూతన బడ్జెట్ తదితర అంశాలను జోడించి నూతన ఆర్థిక సర్వేలతో కలిపి ఆరో ఎడిషన్ పుస్తకాన్ని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ పుస్తకంలో అభ్యర్థులకు పాత ప్రశ్నలకు సమాధానాలు, ప్రాక్టీస్ చేసేందుకు చాప్టర్ వైస్ బిట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ పుస్తకాన్ని పోటీ పరీక్షల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమెజాన్‌లో కూడా ఈ పుస్తకం లభిస్తుందని తెలిపారు.

## మొక్కులు తీర్చుకునేందుకు వచ్చి..అనంత లోకాలకు

- ఈతరాక నీటమునిగి యువకుడి దుర్మరణం



సాయికుమార్ (ఫైల్)

రెంజల్, ఆగస్టు 18: నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకునేందుకు స్నేహితులతో కలిసి నదిలో దిగిన యువకుడు ఈత రాక అదే నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కందకుర్తి గోదావరినదిలో ఆదివారం చోటుచేసుకుంది. రెంజల్ హెడ్ కానిస్టేబుల్ సునీత కథనం మేరకు.. బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన యువకుడు దేవర్ల సాయికుమార్ (22) అదే గ్రామానికి చెందిన స్నేహితుడు ఉదయ్‌కుమార్‌తో కలిసి స్కూటీపై కందకుర్తి గోదావరి నదికి చేరుకున్నారు. పుణ్య స్నానాలు ఆచరించేందుకు ముందుగా నదిలో దిగిన ఉదయ్‌కుమార్ నీటిలో ఈత కొడుతున్నాడు. అనంతరం సాయికుమార్ నీటిలో దిగాడు. ఈత రాక పోవడంతో నీటిలో మునిగాడు. కొంత దూరంలో ఈత కొడుతున్న ఉదయ్‌కుమార్ గమనించి స్నేహితుడిని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సాయికుమార్ అన్న రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి హెడ్ కానిస్టేబుల్ సునీత చేరుకొని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా దవాఖానకు తరలించారు. డిగ్రీ పూర్తి చేసిన సాయికుమార్ ప్రభుత్వ ఉద్యోగ వేటలో ఉన్నాడు. ఈత రూపంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన నాళేశ్వర్ వాసి




ఎల్బ్రస్ పర్వతంపై ఆర్మూర్ మారుతి

నవీపేట, ఆగస్టు 18: గతేడాది కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన ఓ యువకుడు నేడు రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించాడు. మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన ఆర్మూర్ మారుతి ఇదివరకే సిక్కింలోని పర్వతాన్ని అధిరోహించారు. ఈనెల 17న రష్యాలోని 5642 మీటర్ల ఎత్తైన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి జిల్లా ప్రజల మన్ననలు పొందాడు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్, గ్రామస్తులు యువకుడిని అభినందించారు.

## పోలీసులు వేధిస్తున్నారని ఫ్లెక్సీ ఏర్పాటు

- ఓ స్వీట్ షాపు ఎదుట ఏర్పాటు చేసిన నిర్వాహకులు
- నిర్వాహకుడిపై చర్యలు తీసుకునే యోచనలో పోలీసులు




స్వీట్ షాపు ఎదుట నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వినాయక్‌నగర్, ఆగస్టు 18 : షాపు ఎదుట వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పోలీసులు సూచించినందుకు షాపు నిర్వాహకులు పోలీసులపై వినూత్న నిరసన తెలిపారు. తన దుకాణం ఎదుట 'షాప్ ఈజ్ క్లోజ్‌డ్ డ్యూటూ పోలీస్ హరాస్‌మెంట్' అనే ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. చాలా ఏండ్లుగా రక్షాబంధన్ సందర్భంగా కిటకిటలాడే ఈ షాపు.. ఆదివారం ఫ్లెక్సీ ఏర్పాటుచేసి, మూసి ఉండడంతో వినియోగదారులు విస్మయానికి గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్ రోడ్డులో ఉన్న ఓ ప్రముఖ స్వీట్ హోం నిత్యం వినియోగదారులతో కిటకిటలాడుతుంది. ఈ షాపు ఎదుట వాహనాలను పెద్ద సంఖ్యలో, రోడ్డుపై పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌జాం కాకుండా చూసుకోవాలని పోలీసులు నిర్వాహకులకు సూచించారు. దీంతో సదరు షాపు నిర్వాహకులు పోలీసుల వేధింపుల కారణంగానే తాము షాపును మూసివేస్తున్నట్లు పెద్ద ఫ్లెక్సీని దుకాణం ఎదుట ఏర్పాటు చేశారు. పోలీసులకు వ్యతిరేకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో షాపు నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

## స్విమ్మింగ్ పోటీల్లో బినోలా యువతికి బంగారు పతకాలు



పతకాలను చూపుతున్న రిత్విక

నవీపేట,ఆగస్టు 18: మండలంలోని బినోలా గ్రామానికి చెందిన యువతి మిట్టపల్లి రుత్విక రాష్ట్ర స్థాయి మహిళా విభాగంలో స్విమ్మింగ్ పోటీల్లో గెలుపొంది మూడో సారి జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైంది. తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల18న నిర్వహించిన పోటీల్లో సీనియర్ మహిళా విభాగంలో ప్రతిభ చూపి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నది. 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పథకం, 100, 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు పతకాలను సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేశ్ తెలిపారు. కర్ణాటకలోని మంగుళూరులో సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు నిర్వహించనున్న 77వ నేషనల్ అక్విటిక్ చాంపియన్ 2024 జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెలిపారు. రుత్వికను హైదరాబాద్‌లో ఆదివారం స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేశ్, ఉపాధ్యక్షుడు మైపాల్‌రెడ్డి అభినందించారు.











